విభజింపబడిన హృదయం

దాజీ

పూజ్యశ్రీ లాలాజీ మహరాజ్

153 వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన సందేశం

2026 ఫిబ్రవరి 1, 2 & 3 తేదీలు

కాన్హా శాంతివనం

విభజింపబడిన హృదయం

ప్రియ మిత్రులారా,

నా ముందు యాభైలలో పడ్డ ఒక వ్యక్తి కూర్చున్నాడు. బాహ్య ప్రమాణాలనుబట్టి చూస్తే అతన్ని అన్ని విధాలుగా విజయం సాధించిన వ్యక్తి అనవచ్చు. అయితే "నాకేం కావాలో నాకు తెలుసు, నేను ఏమి చేయాలో కూడా నాకు తెలుసు. కానీ, ఆ క్షణం వచ్చినప్పుడు, నేను ఎన్నడూ మళ్ళీ ఏదైతే చేయకూడదు అని తీర్మానించుకున్నానో సరిగ్గా ఆ పనినే చేస్తున్నాను. కింద పడ్డ ప్రతిసారీ నన్ను నేను కొంత కోల్పోతున్నాను. తప్పుచేశాననే విచారంతో నలిగిపోతున్నప్పటికీ, సిగ్గుతో దహించుకుపోతున్నప్పటికీ, మళ్ళీ మళ్ళీ అదే జరుగుతోంది." అంటూ మాట్లాడుతున్నపుడు ఆయన చేతులు కొద్దిగా కంపించాయి.

అతను హింస గురించో దొంగతనం గురించో లేదా తాను మరొకరికి చేసిన ద్రోహం గురించో మాట్లాడటంలేదు. మరింత ఆంతరంగికమైన, ఆగకుండా తనను వెంటాడుతున్న ఒక విధ్వంసకరమైన విషయం గురించి ఆయన మాట్లాడుతున్నాడు. మానవ హృదయంలో, కోరికలకూ ఆకాంక్షలకూ మధ్య జరిగే అంతర్యుద్ధం గురించి ఆయన మాట్లాడుతున్నాడు.

ఈ ఒప్పుకోవడం అనేది అనేక రూపాల్లో కనిపిస్తుంది. తన అనివార్యపు అలవాట్ల నుండి బయటపడలేని నడివయస్సులో ఉన్న ఒక అధికారి; నిష్ఠగా నిర్మలీకరణ చేస్తున్నప్పటికీ పాత ధోరణులనే తిరిగి పొందుతున్న ఒక ఆధ్యాత్మిక సాధకుడు; తాత్కాలిక ఆనందం, శాశ్వత శాంతికి ప్రత్యామ్నాయం కాదని బుద్ధికి తెలిసినాకూడా, ప్రలోభం కలిగినపుడు,

ఆ ప్రవాహంలో కొట్టుకొనిపోయే ఒక గృహస్థుడు; ఈ వివరాలు మారవచ్చు, కానీ వాటి నిర్మాణం మాత్రం ఒకటే. రెండుగా విభజించబడిన హృదయంలోని ఒక భాగం ముక్తి వైపుకు లాగుతుంటే మరొక భాగం భవబంధాల వైపుకు లాగుతూ ఉంటుంది.

అంతరంగ విభజన

"నాలో ఒక భాగం స్వేచ్ఛను కోరుకుంటుంటే మరొకటి నాలోని కోరికను అనుసరించాలని కోరుకుంటోంది", అని ఎవరైనా చెప్పినప్పుడు దానర్థం ఏమిటి? హృదయం గట్టిగా ఒక నిర్ణయానికి ఇంకా రాలేదని దాని అర్థం. స్వేచ్ఛ పట్ల గల ఆకాంక్ష నిజమైనదే, అలాగే కోరిక తాలూకు ఆకర్షణ కూడా! రెండూ ఒకే సమయంలో ఉన్నాయి. అంతరంగ ప్రయత్నం నిర్ణయాత్మకంగా లేనప్పుడు, ఆ సంఘర్షణ సమయంలో ఏ శక్తి ప్రబలంగా ఉంటే అదే గెలుస్తుంది.

ఇది ప్రేయ మరియు శ్రేయ ల మధ్య, అంటే, ప్రియమైనదానికీ, శ్రేయస్కరమైన దానికీ మధ్య జరిగే సంఘర్షణ. వేద కాలం నుండి ప్రముఖంగా చెప్పబడుతున్న సంఘర్షణ. మనస్సు విభాజితమై ఉన్నప్పుడు, అంతరంగ ఆక్రందనకు భగవంతుని చేరుకునేంత ప్రతినాదం ఉండదు. ఎందుకంటే హృదయంలోని సగభాగం ఇంకా తీరాన్ని వదలడానికి సంసిద్ధంగా లేదు కాబట్టి.

చాలామంది సాధకులు ఇక్కడే చిక్కుకుపోయి ఉంటారు. వాళ్ళు నిత్యం ధ్యానం చేస్తారు, సాయంత్రం నిర్మలీకరణ చేస్తారు, పదవ నియమాన్ని అనుసరిస్తారు, నిద్రపోయే ముందు, చేసిన తప్పులకు పశ్చాత్తాపపడతారు, క్షమించమని వేడుకుంటారు, అదే విషయాలను మళ్లీ పునరావృతం చేయనని వాగ్దానం చేసుకుంటారు. అయితే, ఆ వాగ్దానభంగం జరుగుతూనే ఉంటుంది. భంగమయ్యే ప్రతి వాగ్దానమూ నష్టాన్ని కలిగిస్తుంది. విశ్వాసాన్ని క్షీణింపజేస్తుంది, సంకల్పశక్తిని బలహీనపరుస్తుంది. బహుశా స్వేచ్ఛ అనేది 'ఇతరులకు ఉద్దేశించబడిందే కానీ, తనకోసం మాత్రం కాదేమో' అనే ఒక సూక్ష్మమైన నిరాశభావం స్థిరపడటం ప్రారంభమవుతుంది.

అయితే తప్పు ఎక్కడ జరిగింది?

రెండు తోడేళ్ళు

అనేక సంస్కృతులలో ప్రతి మానవ హృదయంలోనూ రెండు తోడేళ్ళుంటాయని చెప్పే పురాతన బోధన ఒకటుంది. ఒక తోడేలు మన ఉన్నత స్వభావం, సహనం, దయ, సత్యం, క్రమశిక్షణ, శాశ్వతమైనదాని పట్ల ప్రేమను సూచిస్తుంది. మరో తోడేలు మన నిమ్న స్వభావం, ప్రేరేపణ, తృష్ణ, మోసం, విచ్చలవిడితనం క్షణికమైన వాటి పట్ల మనకుండే అనుబంధాన్ని సూచిస్తుంది.

ఒక యువకుడు తన కన్నా పెద్దాయన్ని "ఏ తోడేలు గెలుస్తుంది?" అని అడిగాడు. దానికి ఆ పెద్దాయన, "నువ్వు దేన్ని పోషిస్తే అది" అని జవాబిచ్చాడు.

బోధన సులభమే, కానీ దాని ఆచరణ సులభం కాదు. విడువని కోరికతో పోరాడుతున్న ఒక సాధకుడు ఈ రెండు తోడేళ్ళకు ఆహారం ఇస్తున్నాడు. ఉదయం ధ్యానంలో,

ఉన్నతమైన తోడేలు తన వంతుని పొందుతుంది. అలాగే సాయంత్రం నిర్మలీకరణలో ఉన్నతమైన తోడేలు బలపడుతుంది. స్పష్టత, దృఢ సంకల్పపు క్షణాలలో ఉన్నతమైన తోడేలు ఎదుగుతుంది. అప్పుడు ప్రేరేపించేదొకటి వస్తుంది. అప్పుడు విచ్చలవిడితనం, కల్పన, ఆశించడం వల్ల కలిగే రహస్య ఆనందాల ద్వారా పోషింపబడిన నిమ్న తోడేలు కూడా, తన స్వంత బలంతో పైకి లేస్తుంది. ఆ సంఘర్షణ సమయంలో, ఏ తోడేలు బలంగా ఉంటే అది గెలుస్తుంది. సాధకునికి నిమ్న స్వభావం ఉండటం ఇక్కడ సమస్య కాదు, అది అందరికీ ఉంటుంది. ఇక్కడ సమస్య ఏమిటంటే, పోషణ చాలా సమతుల్యంగా జరగడం వలన తోడేళ్ళు రెండూ సజీవంగా, శక్తివంతంగా ఉంచబడ్డాయి. ఏఒక్కటీ నిర్ణయాత్మకంగా బలహీనపడనందున ఆ యుద్ధం అలా కొనసాగుతూనే ఉంటుంది.

కేవలం నిర్మలీకరణ ఒక్కటే ఎందుకు సరిపోదు

నిర్మలీకరణ అనే హార్ట్‌ఫుల్‌నెస్ అభ్యాసం చాలా లోతైనది. ప్రతి సాయంత్రమూ సాధకుడు కూర్చుని, ఆ రోజు వచ్చిన సంక్లిష్టతలు, మాలిన్యాలు తన వెనుక నుండి బయటకు వెళ్ళిపోతున్నట్లుగా భావిస్తాడు, అలాగే తన ముందు నుండి ప్రవేశించే దివ్య ప్రకాశాన్ని స్వీకరిస్తాడు. ముద్రలు తొలగిపోయి, వ్యవస్థ తేలికవుతుంది. స్వేచ్ఛ సమీపిస్తుంది. కానీ కొంతమంది సాధకులు సంవత్సరాల తరబడి శ్రద్ధగా నిర్మలీకరణ చేసుకుంటున్నప్పటికీ, కొన్ని ధోరణులు మొండిగా అంటుకొని ఉండిపోతున్నాయని చెబుతుంటారు. కొన్నిసార్లు మునుపటి కంటే ఎక్కువ శక్తితో వారి కోరికలు తిరిగొస్తాయి, ఈ తంతు ఇలా కొనసాగుతూ ఉంటుంది. ఎందుకని?

ఎందుకంటే వదులుకోవడానికి మన హృదయం ఇష్టపడేవాటినే నిర్మలీకరణ తొలగిస్తుంది. ఒక ధోరణిని రహస్యంగా ఇష్టపడినప్పుడు, మనస్సులోని ఒక భాగం దానిని నిగూఢమైన ఆప్యాయతతో పట్టుకుని ఉన్నప్పుడు, నిర్మలీకరణ ప్రతిఘటనను ఎదుర్కొంటుంది. ఆ పద్ధతి తనదైన స్థాయిలో పనిచేస్తూనే ఉంటుంది. ఆ ధోరణి యొక్క లోతైన మూలం తన అస్తిత్వపు గుర్తింపు ద్వారా రక్షించబడుతూనే ఉంటుంది.

దానికి మరోసారి లొంగిపోయిన నాటి సాయంత్రం నిర్మలీకరణ చేసుకున్నప్పుడు ఏమి జరుగుతుంది? మనస్సు పశ్చాత్తాపం చెందుతుంది. హృదయం బాధతో నిండిపోతుంది.

క్షమాపణ కోరుతూ ప్రార్థన సమర్పించబడుతుంది. ఒక వాగ్దానం మళ్ళీ చేయబడుతుంది. అయితే ఆ వాగ్దానం ఎంత యథార్థమైనదన్నదే ప్రశ్న.

శ్రద్ధ లేని – అర్థ హృదయ ప్రార్థన

ఏదైనా కావాలి అని కోరుకోవడానికి, దానిని నిజంగా కోరుకోవడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. నిరంతర కోరికలతో పోరాడుతున్న సాధకుడు నిజంగా స్వేచ్ఛను కోరుకోవచ్చు. పశ్చాత్తాపం చెందే క్షణంలో, ఆ కోరిక తీవ్రంగా ఉంటుంది. ప్రార్థన చేసే సమయంలో, ఆకాంక్ష నిజమైనదిగా అనిపిస్తుంది. ధ్యానం యొక్క మౌనంలో, ముక్తి అనేది చేరువలో ఉందనిపిస్తుంది.

అప్పుడు ప్రేరకమనేది ప్రత్యక్షమవుతుంది. ఒక పరిస్థితి తలెత్తుతుంది, నాడీ వ్యవస్థలో తరచుగా ఉపచేతనలో లోతుగా పాతిపెట్టబడిన ప్రతిస్పందనల పాత మార్గం వెలగడం మొదలవుతుంది. అకస్మాత్తుగా, ఉన్నతమైనదానికోసం పడే ఆకాంక్షంతా ఆవిరైపోతుంది. మిగిలేది కోరిక యొక్క అపక్వాకర్షణ మాత్రమే. ఆ క్షణంలో, ఆకాంక్ష తాలూకు మూలాలు నిజంగా ఎంత పైపైనే ఉన్నాయనేది సాధకునికి తెలుస్తుంది.

ఇది కపటత్వం (హిపోక్రసీ) కాదు; ఇది మానవుని యొక్క స్థితి. సమస్య ఏమిటంటే మనం స్వేచ్ఛ కోరుకోవడంలో అబద్ధం చెబుతున్నామని కాదు. సంఘర్షణ నుండి బయటపడేంత గాఢమైన ఆకాంక్షను మనమింకా పెంచుకోలేకపోవడమే సమస్య. ప్రార్థన నిజమైనదే, కానీ అది కూడా అర్థ హృదయంతో శ్రద్ధలేకుండా ఉంటుంది.

ఏదైనా కావాలి అని కోరుకోవడానికి, దానిని నిజంగా కోరుకోవడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. నిరంతర కోరికలతో పోరాడుతున్న సాధకుడు నిజంగా స్వేచ్ఛను కోరుకోవచ్చు. పశ్చాత్తాపం చెందే క్షణంలో, ఆ కోరిక తీవ్రంగా ఉంటుంది. ప్రార్థన చేసే సమయంలో, ఆకాంక్ష నిజమైనదిగా అనిపిస్తుంది. ధ్యానం యొక్క మౌనంలో, ముక్తి అనేది చేరువలో ఉందనిపిస్తుంది.

వ్యాపారి – సన్యాసి

ఒక సంప్రదాయపు కథ దీనిని బాగా వివరిస్తుంది. ఒక వ్యాపారి, తన కొనుగోలుదారులను మోసం చేయడం ఆపుకోలేక ఇబ్బందిపడి ఒక సన్యాసి వద్దకు వచ్చాడు.

"ఇది తప్పు అని నాకు తెలుసు" అని అతను చెప్తూ "ప్రతి సాయంత్రమూ నేను నిజాయితీగా ఉంటానని ప్రమాణం చేసుకుంటున్నాను. అయినప్పటికీ ప్రతీ ఉదయం నేను మళ్ళీ అబద్ధం చెబుతూనే ఉన్నాను. నాలో ఉన్న లోపం ఏమిటి?"

"నువ్వు సాయంత్రం ప్రమాణం చేసినప్పుడు, నిజంగా నిజాయితీగానే ఉండాలని కోరుకుంటావా?" అని సన్యాసి అడిగాడు.

"అవును, ఖచ్చితంగా" అని వ్యాపారి బదులిచ్చాడు.

"మరుసటి ఉదయం కొనుగోలుదారుడు నీ ముందు నిలబడినప్పుడు కూడా నువ్వు ఇంకా నిజాయితీగా ఉండాలనే కోరుకుంటున్నావా?"

వ్యాపారి కాస్త ఆగి, "ఆ క్షణంలో, మరింత అమ్మకం నాకు కావాలనిపిస్తుంది" అని బదులిచ్చాడు.

"అలాంటప్పుడు సాయంత్రం ప్రమాణం చేసిన వ్యక్తి వేరు, ఉదయం ఎంపిక చేసే వ్యక్తి వేరన్నమాట. ఆ ఇద్దరూ ఒకే వ్యక్తి అయ్యేవరకు, నీ ప్రమాణం భగ్నం అవుతూనే ఉంటుంది." అని సన్యాసి అన్నాడు.

వారిద్దరిని ఒకటిగా ఎలా చేయాలని ఆ వ్యాపారి అడిగాడు.

"అమ్మకం కంటే కూడా ఎక్కువగా నీకు ఏది కావాలో నీవు అన్వేషించగలగాలి. దానిని నువ్వు కనుగొన్నప్పుడు, అబద్ధం చెప్పడం దానంతటదే ఆగిపోతుంది" అని ఆ సన్యాసి బదులిచ్చాడు.

క్షయమయ్యే సంకల్పశక్తి

పదే పదే జరిగే వైఫల్యంలో ఒక యాంత్రికపరమైన సూత్రం ఉంది. ప్రతీ పతనం తదుపరి పరీక్ష కోసం ఆ నిర్మాణాన్ని బలహీనపరుస్తుంది. ఒక నిర్దిష్ట భారాన్ని మోయడానికి రూపొందించబడిన వంతెన ఇంకొంచెం ఎక్కువ భారాన్ని ఒకసారి మోయగలదు.

అయితే పదేపదే అలా జరిగితే, దానిలో సూక్ష్మమైన పగుళ్లు పెరుగుతాయి. వంతెన బయటకు పటిష్టంగా కనిపించవచ్చు కానీ నష్టం అనేది అంతర్గతంగా ఉంటుంది. పర్యవసానంగా, ఒక కొద్దిపాటి బరువు కూడా ఒక ఘోర వైఫల్యానికి కారణమవుతుంది.

సంకల్పశక్తి ఆ విధంగానే పనిచేస్తుంది. దాన్ని లెక్క చేయక దాటవేసిన ప్రతిసారీ, ఉన్నతమైన మనస్సు తీసుకున్న స్పష్టమైన నిర్ణయం కోరిక యొక్క ఉప్పెనవల్ల కొట్టుకుపోయిన ప్రతిసారీ, ఎక్కడో ఒకచోట బీటలు పడతాయి. బీటలు కనిపించకపోవచ్చు, కానీ నష్టం మాత్రం పేరుకుపోతూనే ఉంటుంది.

అందుకే చాలాసార్లు పడిపోయిన సాధకుడు, తాను సాధన ప్రారంభించినప్పటి కంటే ఇప్పుడు మరింత బలహీనంగా ఉన్నట్లు తరచూ తెలియజేస్తాడు. సాధన వాళ్లని బలోపేతం చేస్తుందని ఆశిస్తారు, కానీ పదేపదే పొందిన వైఫల్యం వాళ్లు నిర్మించడానికి ప్రయత్నిస్తున్న సామర్థ్యాన్నే క్షీణింపజేస్తుంది. సంకల్పబలాన్ని పరీక్షించకుండా ఉండటమనేది దీనికి పరిష్కారం కాదు; వైఫల్యం కోసం దాన్ని తయారుచేయకుండా ఉండటమే పరిష్కారం.

నిజాయితీపూర్వక అంచనా

హృదయం యొక్క వాస్తవ స్థితి గురించిన కఠినమైన నిజాయితీతోనే పరివర్తన ప్రారంభమవుతుంది. మనలో చాలామంది స్వేచ్ఛ పట్ల మనకున్న నిబద్ధతను అతిగా అంచనా వేసుకుంటాం. మన ప్రవృత్తులతో మనకున్న అనుబంధాన్ని తక్కువగా అంచనా వేస్తాం. ఈ తప్పుడు–అంచనా వాగ్దాన భంగాలకు దారి తీస్తుంది. తద్వారా పైన వివరించిన విశ్వాసాన్ని అది దెబ్బతీస్తుంది.

నిజాయితీగలిగిన అంచనా అంటే ఏమిటి? సిగ్గుదనం గాని లేదా రక్షణాత్మక భావన గానీ లేకుండా, అంతరంగంలోని కోరికల ఖచ్చితమైన నిష్పత్తిని అంగీకరించడం అని దీని అర్థం. ఒకటి నుంచి పది వరకు గల కొలమానం (స్కేల్) లో, అసలు మీరు ముక్తిని ఎంతవరకు ఆశిస్తున్నారు? అదే స్కేలుపై, మీ ప్రవృత్తి ఇస్తున్న ఆనందాన్ని మీరు ఎంతవరకు కోరుతున్నారు?

చాలామందికి, నిజాయితీతో కూడిన సమాధానం కళ్ళు తెరిపిస్తుంది. ముక్తి కోసం ఆకాంక్ష ఐదు లేదా ఆరుగా నమోదు కావచ్చు, అయితే ప్రవృత్తి యొక్క ఆకర్షణ ఎనిమిది లేదా తొమ్మిదిగా నమోదు కావచ్చు. ఈ నిష్పత్తులను బట్టి, ఏ ఘర్షణ యొక్క ఫలితమైనా ఊహించదగినదే అవుతుంది. అయినప్పటికీ, ఇది నిరాశకు కారణం కారాదు; ఇది మనం ఆచరించబోయే వ్యూహానికి ఒక కారణం కావాలి. మీ ఆకాంక్ష, మీ కోరిక యొక్క ఆకర్షణ కంటే బలహీనంగా ఉంటే, ఆకాంక్షపై పని చేయండి. ప్రస్తుతమున్న నిష్పత్తి ఊతం ఇవ్వని వాగ్దానాలను చేయకండి. దానికి బదులుగా, పరిమాణ నిష్పత్తినే మార్చివేయడంపై దృష్టి పెట్టండి.

తపనను ఏది పెంచుతుంది?

దివ్యత్వం కోసం తపన సంకల్ప శక్తి ద్వారా పెరగదు; ఇది ధ్యానసంపర్కం ద్వారా, తద్వారా ఏర్పడే ఆత్మానుసంధానం (ఆస్మోసిస్) ద్వారా పెరుగుతుంది.

మనం ధ్యానంలో సమయం గడిపినప్పుడు, మన ఎరుకకు అతీతంగా ఏదో జరుగుతుంది. వ్యవస్థ ప్రాణాహుతి ప్రసారాన్ని అందుకుంటుంది. అప్పుడు, ప్రసారమవుతున్న స్థితిలోని కొంతభాగాన్ని హృదయం గ్రహిస్తుంది. కాలక్రమేణా, పదేపదే జరిగే సంపర్కాల వల్ల ఒక నూతన ఆధారము, నూతన సాధారణత, మరియు సాధ్యమవగల సరికొత్త అవగాహన సృష్టించబడతాయి.

అందుకే సత్య సాంగత్యం, లేదా సత్సంగం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఒక మాస్టర్ సన్నిధిలోగానీ లేదా తన తపనను సంపూర్ణంగా మార్చుకున్న అంకితభావం గల ఒక ప్రశిక్షకుడి సమక్షంలోగానీ, మన హృదయాలలో ఏదో కదలిక వస్తుంది. ఉన్నతమైన కోరిక యొక్క ఫ్రీక్వెన్సీతో అనునాదం జరుగుతుంది. అప్పుడు మన స్వంత ఫ్రీక్వెన్సీ మారడం ప్రారంభమవుతుంది.

అదేవిధంగా, ఆ యాత్ర పూర్తిచేసిన వారి మాటలను చదవడానికి గడిపిన సమయం, మన ప్రవృత్తులకు, ధోరణులకు అతీతంగా ఉన్నదాని గురించి ఆలోచించడంలో గడిపిన సమయం, స్వయంకేంద్రిత దృష్టిని తొలగించే నిస్వార్థసేవలో గడిపిన సమయం,

మనం ధ్యానంలో సమయం గడిపినప్పుడు, మన ఎరుకకు అతీతంగా ఏదో జరుగుతుంది. వ్యవస్థ ప్రాణాహుతి ప్రసారాన్ని అందుకుంటుంది. అప్పుడు, ప్రసారమవుతున్న స్థితిలోని కొంతభాగాన్ని హృదయం గ్రహిస్తుంది. కాలక్రమేణా, పదేపదే జరిగే సంపర్కాల వల్ల ఒక నూతన ఆధారము, నూతన సాధారణత, మరియు సాధ్యమవగల సరికొత్త అవగాహన సృష్టించబడతాయి.

ఇవన్నీ ఉన్నతమైన తోడేలుకు పోషణను ఇస్తూ, నిమ్న తోడేలు తక్కువ శ్రద్ధ పొందేలా చూస్తాయి.

ఈ మార్పు క్రమంగా జరుగుతుంది, తద్వారా ఒక ఉదయం వేరొకరితో జరిగిన ఘర్షణ భిన్నంగా ఉన్నట్లు మనం గమనిస్తాం. ప్రతిస్పందనాత్మక ఆకర్షణ ఇప్పటికీ ఉన్నా కూడా, దాంతోబాటు ఇంతకు ముందు లేనిది, ఇంకేదో కూడా ఉంది, లేదా ఆకర్షణ ఉన్నా, అది బలహీనంగా ఉంది. దాని నిష్పత్తి మారిపోయింది.

అంతరంగ ఆక్రందన యొక్క నాణ్యత

ప్రాపంచిక విషయాలపై ఉన్నంత తీవ్ర తపన భగవంతుని పట్ల ఉంటే, సాక్షాత్కారం తక్షణమే కలుగుతుందని బాబూజీ మహరాజ్ ఒకసారి వ్యాఖ్యానించారు.

దీని అర్థం ఏమిటో చూద్దాం. ఒక బలమైన కోరిక తలెత్తినప్పుడు, అది మన మొత్తం వ్యవస్థను చుట్టుముడుతుంది. ఆలోచన, అనుభూతి, శరీరం, సంకల్పం – అన్నీకూడా దాన్ని నెరవేర్చుకునే దిశగా సమన్వయం అవుతాయి. దానికి వ్యతిరేకంగా నిలువగలిగే శక్తి దేనికీ లేదు కాబట్టి ప్రతిఘటన అనేది కుప్పకూలిపోతుంది. ముక్తి పట్ల మనకున్న కోరిక కూడా ఇదేవిధంగా అన్నింటినీ ఏకం చేసేంతగా ఉంటే ఏమి జరుగుతుంది? అప్పుడది తక్కువ స్థాయి కోరికతో పోరాడవలసిన అవసరం ఉండదు, ఎలాగైతే ఒక పెద్ద నది ఒక చిన్న వాగుని తనలో కలుపుకుంటుందో అలా అది దానిని తనలో విలీనం చేసుకుంటుంది. ఒక పెద్ద ప్రవాహం అన్ని జలాలను ఒకేదిశలో తీసుకువెళుతుంది.

అందుకే అర్థ హృదయంతో చేసే శ్రద్ధలేని ప్రార్థన మనల్ని మార్చలేదు. అందుకే పైపైకి పశ్చాత్తాపపడటం మనలో లోతుగా పాతుకుపోయిన అలవాట్లు, ప్రవృత్తులపై ప్రభావం చూపలేదు. ఆ తీవ్రత సరిపోలేదు: స్వేచ్ఛ పట్ల మన తపన ఒక కొవ్వొత్తి అనుకుంటే, అలవాటు యొక్క ఆకర్షణ పెద్ద భోగి మంటలాంటిది. నిష్పత్తి పరిమాణం మారనంతవరకు, ఫలితం ముందుగానే నిర్ణయించబడి ఉంటుంది.

గూడు – సీతాకోకచిలుక

ఒక వ్యక్తి ఒకరోజు గూటిలో నుండి బయటకు రావడానికి కష్టపడుతున్న సీతాకోకచిలుకను గమనించాడు. దాని రంధ్రం చిన్నదిగా ఉండటం వలన సీతాకోకచిలుక గంటలతరబడి కష్టపడుతూ, బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తోంది. కనికరంతో ఆ వ్యక్తి ఒక కత్తెర తీసుకుని, ఆ రంధ్రాన్ని పెద్దదిగా చేయడానికి గూడును కత్తిరించాడు. సీతాకోకచిలుక తేలికగా బయటకొచ్చేసింది, కానీ దాని శరీరం ఉబ్బిపోయి ఉంది, దాని రెక్కలు ఎప్పటికీ ఎగరలేని విధంగా ముడుచుకుపోయి ఉన్నాయి.

ఆ చిన్న రంధ్రం ద్వారా సీతాకోకచిలుక చేసే సంఘర్షణ, దాని శరీరం నుండి ద్రవాన్ని తన రెక్కల్లోకి బలవంతంగా పంపడానికి ప్రకృతి ఎంచుకున్న మార్గం అని ఆ వ్యక్తికి అర్థం కాలేదు. సీతాకోకచిలుకకు ఎగరగలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి బయటకు క్రూరంగా కనపడే ఆ కష్టం చాలా అవసరం. అదేవిధంగా, ప్రయాణంలో ఉన్న సంఘర్షణను తొలగించమని భగవంతుడిని ఒక సాధకుడు కోరుకోవడం అంటే, రెక్కలు ముడుచుకుపోయి బయటకురావాలని కోరుకోవడమే.

చాలామంది సాధకులు తమ ప్రవృత్తుల నుండి స్వేచ్ఛ కోసం ప్రార్థిస్తారు. వాళ్లు తమ కోరికలను తొలగించమని, తమ చిత్తాన్ని బలపరచమని, మార్గాన్ని సులభతరం చేయమని భగవంతుణ్ణి వేడుకుంటారు, కానీ తరచుగా ఏమీ జరిగినట్లు కనపడదు. కోరిక మిగిలే ఉంటుంది, సంకల్పం బలహీనంగా ఉంటుంది, మార్గం కష్టతరంగా ఉంటుంది. ఇది కొంతమంది సాధకులను అనుమానంతో వారి విశ్వాసం కోల్పోయేలా చేస్తుంది. భగవంతుడు వినడం లేదని, ఆయన పట్టించుకోడు అని లేదా అసలు భగవంతుడే లేడని వారు అనుకుంటారు... అయితే దీనికి మరో అవకాశం కూడా ఉంది.



పరివర్తన కోసం ఆ కష్టాన్ని ఉపయోగించుకోవడమే ఒకవేళ భగవంతుని ప్రతిస్పందన అయితే? ఒకవేళ సంఘర్షణనేది ముక్తికి కావలసిన బలాన్ని సాధకుడు అభివృద్ధి చేసుకునే సాధనమే అయితే? ఇప్పుడీ ప్రత్యామ్నాయాన్ని చూడండి. కేవలం అభ్యర్థనపై ప్రతీ సమస్యాత్మకమైన ధోరణిని భగవంతుడు తొలగిస్తే, సాధకుడు ఆధ్యాత్మికపరంగా ఒక శిశువుగానే ఎప్పటికీ మిగిలిపోతాడు. నిజమైన స్వేచ్ఛకు కావలసిన అంతర్గత సమర్థతను వాళ్ళు ఎప్పటికీ అభివృద్ధి చేసుకోరు. వారు నిజమైన అర్థంలో ముక్తిని పొందకుండానే విడుదల చేయబడతారు. సంఘర్షణ అనేది దైవం యొక్క అలక్ష్యానికి సూచిక కాదు; అది ఒక బోధనాంశం.

నిజమైన పశ్చాత్తాపం యొక్క క్షణం

విచారం చెందడానికీ పశ్చాత్తాపం చెందడానికీ వ్యత్యాసం ఉంది. “నేను అలా చేయకుండా ఉంటే బాగుండేది. దాని గురించి నేను బాధపడుతున్నాను. ఈ సారి మరింత మెరుగ్గా చేయాలని ఆశిస్తున్నాను.” అని విచారం అంటుంది. “నేను ఏమి చేస్తున్నానో గమనిస్తున్నాను, దాని మూల్యం ఏమిటో నేను గ్రహిస్తున్నాను, నేను ఈ విధంగా కొనసాగలేనని తెలుసుకున్నాను. ఇప్పుడు, ఈ క్షణంలో నాలో ఏదో, వేరే దిశగా పరిణామం చెందుతోంది.”

అని పశ్చాత్తాపం అంటుంది, విచారం అనేది భావోద్వేగపరమైనది, అది తరచుగా అపరాధభావం, అవమానాల యొక్క పెరిగే భారంతో ముడిపడి ఉంటుంది. అయితే పశ్చాత్తాపం అనేది అస్తిత్వంతో సంబంధం కలిగి ఉంటుంది. విచారం మన ఉపచేతనయొక్క ప్రవృత్తులను వృద్ధి చేయడం కొనసాగిస్తూనే, చైతన్యపు స్థాయిలో వస్తుంది, పోతుంది. అయితే పశ్చాత్తాపం అనేది ముందు జరిగినదానికి, తరువాత జరిగినదానికి నడుమ స్పష్టతను తీసుకొస్తూ, ధోరణులను విచ్ఛిన్నం చేయడానికి చర్యను కోరుతుంది.

బాబూజీ మహరాజ్ చెప్పిన పదవ నియమం[1] కేవలం విచారించడానికి కాకుండా, పశ్చాత్తాపం చెందడానికి ప్రాముఖ్యతనిస్తుంది. బాబూజీ చెప్పిన వినమ్ర భావంతో క్షమాపణ వేడుకోవడం అనేది, తన మీద తాను జాలిపడే లేదా దుఃఖపడే మనోస్థితి కాదు. అది భగవంతుని ముందు పసిపిల్లలకున్నటువంటి నిజాయితీతో కూడిన మానసిక స్థితి.

విచారము – పశ్చాత్తాపాల మధ్య వ్యత్యాసం: మలుపు యొక్క నిర్మాణం

విచారం
(గతంలోకి అవలోకించడం)

పశ్చాత్తాపం
(అస్తిత్వపు కేంద్రం)

స్థిరపడిన అహం.
“నేను అలా చేయకుండా ఉండాల్సింది”
ఒక అవమానపు సుడిగుండం.
భావోద్వేగపరమైన ఉచ్చు.

పరిపూర్ణ నిజాయితీ.
“ఈ విధంగా కొనసాగలేను. నాకు సహాయం చేయండి.”
“ముందు - తరువాత”
జరిగిన దానిలో స్పష్టత: ముందుకుసాగే మలుపు.

[1] సహజమార్గ దశనియమాలపై వ్యాఖ్యానము – రామచంద్ర, రామచంద్ర మిషన్,ఇండియా.

ఏమీ దాచకుండా, దేనినీ సమర్థించకుండా, కేవలం హృదయపు వాస్తవ స్థితిని దైవం ముందు ఉంచి, సహాయం కోరడం.

పశ్చాత్తాపం నిజమైనది అయినప్పుడు, అది నెరవేర్చలేని వాగ్దానాలను చేయదు. బదులుగా, అది ఇలా అంటుంది, "ఇదీ నేను. నేను చేస్తూ వస్తున్నదీ ఇదే. నేను ఆపగలనో లేదో నాకు తెలియదు కానీ, నేను ఆపాలనుకుంటున్నాను. దయచేసి నాకు సహాయం చేయండి." ఈ రకమైన ప్రార్థన మన ప్రవృత్తులు, ధోరణులకంటే లోతుగా ఉంటుంది. ప్రయత్నం విఫలమైనచోట, అలాంటి నిజాయితీ భగవంతుని కృపకు మార్గాన్ని సుగమం చేస్తుంది.

ప్రవర్తనా ధోరణులు వాస్తవానికి ఏమి కోరుకుంటున్నాయి

కోరికలతో మన సంబంధాన్ని తక్షణమే మార్చే రహస్యం ఒకటుంది: మన ప్రవృత్తులు, కోరుకుంటున్నట్లు కనపడే వాటిని కోరుకోవు. వాస్తవంగా అవి ఇంకా లోతైనదాన్ని సూచిస్తాయి. మూలంలో చూసినపుడు, శారీరక ఆనందం కోసం పడే తపన, నిజానికి ఐక్యమయ్యేందుకు పడే తపన. క్షణిక తృప్తి కోసం చేసే అవిరామపు అన్వేషణ, మూలంలో చూస్తే, శాశ్వతమైన తృప్తి కోసం జరిపే ఒక అన్వేషణ. అశాశ్వతమైనవాటితో అనుబంధం, మూలంలో చూస్తే, శాశ్వతమైన దానిని పట్టుకునే ఒక ప్రయత్నం. ప్రవృత్తులు ఏమి కోరుతున్నాయో అది తప్పు కాదు; కానీ అవి ఎక్కడ కోరుతున్నాయనేదే తప్పు.

దీన్ని అర్థం చేసుకున్నప్పుడు, మన ప్రవృత్తులను సంఘర్షణతో గాక కరుణతో చూడవచ్చు: "మీరు ఏం కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారో అది నాకు తెలుసు. అది ఇక్కడ లేదు, కాని అది ఎక్కడ ఉందో నాకు తెలుసు. నావెంట రండి."

ఈ ప్రతిస్పందన ఒక ప్రవృత్తితో పోరాడటమో లేదా దాని ఉనికిని అణచివేయడమో లేదా తిరస్కరించడమో కాదు. పోరాడటం వల్ల రెండు పక్షాలూ బలపడతాయి. తిరస్కరించడం అనేది ఉపచేతనలో ఇబ్బందిని కలిగిస్తుంది, అక్కడ అది ఎప్పటికైనా ప్రేరేపించబడవచ్చు కూడా! మరోవైపు, వెలుగును ప్రసరింపజేయడం ద్వారా మూలంలోని అపార్థాలను కరిగించివేయవచ్చు.

అన్నింటినీ మార్చే మలుపు

ఈ యాత్రలో ఎక్కడో ఒకచోట ఏదో మారుతుంది. ఇది నాటకీయమైన మార్పు కాదు. దీన్లో ఎలాంటి హడావుడీ ఉండదు. తరచూ, మనం దానిని వెంటనే గమనించలేము కూడా. కానీ మన గురుత్వకేంద్రం మారుతుంది. ఇంతకుముందు, హృదయం సుఖం వైపు దృష్టి ఉంచేది, అప్పుడప్పుడు మాత్రమే స్వేచ్ఛ వైపు చూసేది. ఇప్పుడేమో హృదయం స్వేచ్ఛ వైపు దృష్టి సారించి ఉంచుతోంది, అప్పుడప్పుడు పాత ప్రవృత్తులు లాగుతుంటాయి. లాగడం అనేది కొనసాగుతుంటుంది కానీ దిశ మారింది.

ఈ మార్పు బలవంతంగా సాధ్యం కాదు, కానీ మనం దాని కోసం సంసిద్ధులం కావచ్చు. పడవను నడపడం నేర్చుకుంటున్న వ్యక్తి మొదట్లో బలమైన గాలులు, విరుచుకుపడే అలల కారణంగా బోల్తా పడతాడు; కానీ క్రమంగా, స్థిరమైన అభ్యాసంతో, అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ పడవ నడపడంలో ప్రావీణ్యం సంపాదిస్తాడు. అదేవిధంగా, మన సాధన, రోజువారీ నిర్మలీకరణ, రోజువారీ ధ్యానం, నిజాయితీగలిగిన ఆత్మ పరిశీలన, పతనాల వల్ల కలిగే పరిణామాలు, మన ప్రవృత్తులను అధిగమించిన వాటితో పెరుగుతున్న పరిచయం, మనల్ని ముందుకు సాగడానికి సిద్ధం చేస్తాయి. అప్పుడు మార్పు అనేది, హృదయం సంసిద్ధంగా ఉన్నప్పుడు, తగిన సమయంలో కృపతో జరుగుతుంది.

మళ్ళీ మళ్ళీ పతనమవుతున్న వ్యక్తి కోసం

మీరు దీన్ని చదువుతున్నపుడు మీ స్వీయ సంఘర్షణ గుర్తుకొస్తే, మీ యొక్క వైఫల్యం వృథా కాలేదని తెలుసుకోండి. ప్రతి పతనమూ మీలో ఏదో ఒకదాన్ని జమ చేసింది. ప్రతి పునరుద్ధరణా ఏదో ఒకదానిని నిర్మించింది. మీరు ఈ భారాన్ని ఇంకా అనుభవిస్తున్నారంటే, మీరు ఇంకా దేనినో వదిలిపెట్టలేదని అర్థం.

ఇప్పుడు కావలసింది విఫలమైన అదే ప్రయతాన్ని మరింత ఎక్కువగా చేయడం కాదు; కోరుకోవడంలోని నాణ్యతాగుణాన్ని మార్చుకోవడం. ఇక్కడ కొన్ని సూచనలు ఇవ్వబడ్డాయి:

మీరు నిలబెట్టుకోలేని వాగ్దానాలు చేయడం మానేయండి. నిజాయితీగా మిమ్మల్ని మీరు అంచనా వేసుకోండి: వాస్తవానికి మీకు ఎంత స్వేచ్ఛ కావాలి? దాన్ని మీ కోరికల ప్రవృత్తులచేత మీరు ఎంతగా లాగబడుతున్నారు అనేదానితో కొలవండి. ఖచ్చితంగా ఉండండి, నిస్సంకోచంగా ఉండండి, సంబంధిత ఆకర్షణల గురించిన ఎరుకతో ఉండండి.

అప్పుడు "ఈ నిష్పత్తుల పరిమాణం ఎలా మారగలదు?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఇది కేవలం సంకల్పబలం ద్వారా గానీ, నైతిక ప్రయత్నం ద్వారా గానీ జరగదు. పెద్ద ఆకలిని (ఉన్నత తోడేలుని) పోషిస్తూ, చిన్న ఆకలిని (నిమ్న తోడేలుని) పస్తు ఉంచడం ద్వారా ఇది జరుగుతుంది. లోతైన తపనను జాగృతం చేసే ప్రాణాహుతిని అందుకోవడం వలన, మీలోని అత్యున్నత సామర్థ్యాలను గుర్తుచేస్తూ మార్గనిర్దేశం చేయగలిగిన వారితో సహవాసం చేయడం వలన ఈ మార్పు సంభవిస్తుంది.

నిలబెట్టుకోదగిన వాగ్దానం

నిలబెట్టుకోగలిగిన వాగ్దానం ఒకటి ఉంది – అదేమిటంటే, ప్రయత్నిస్తూనే ఉంటానని వాగ్దానం చేయడం. ప్రతిసారీ విజయం సాధిస్తానని వాగ్దానం చేసుకోవడంలో అర్థం లేదు, ఎందుకంటే అది మానవ స్థాయికి అతీతమైనది. ప్రయత్నించడాన్ని కొనసాగించడం, పడినప్పటికీ లేస్తూ ఉండడం, హృదయాన్ని అత్యున్నతమైన వాటివైపు తిప్పుకోవడం, ఇవన్నీ మనకు అందుబాటులో ఉన్నవి.

వైఫల్యం లేకపోవడాన్నిబట్టి దైవం పురోగతిని కొలవదు; ఆకాంక్షను వదలకుండా కొనసాగించడాన్నిబట్టి దైవం పురోగతిని కొలుస్తుంది. వెయ్యిసార్లు పడిపోయినా వెయ్యిన్నొకటోసారి పైకి లేచిన సాధకులు ఏదో ముఖ్యమైన విషయాన్ని ప్రదర్శిస్తారు; వాళ్లు మార్గాన్ని విడిచిపెట్టడానికి నిరాకరించారు. ఈ నిరాకరణే ఒక విజయం, ఆ పట్టుదలే ఒక పరివర్తన. కాలక్రమేణా మొండిగా, కొన్నిసార్లు యాంత్రికప్రయత్నంగా ప్రారంభమైనది చివరికి సహజ ధోరణిగా మారుతుంది. గతంలో సంఘర్షణగా ఉన్నది ఇప్పుడొక ప్రవాహంగా మారుతుంది, విభజించబడి ఉన్నది సంపూర్ణంగా మారుతుంది.

విభజించబడిన హృదయం ఎల్లప్పటికీ అలాగే ఉండదు. ఏదోఒకరోజు, ఎటువంటి ఆర్భాటం లేకుండా, అది సులభంగా తన దిశను కనుగొంటుంది.

అలా జరిగినప్పుడు, వేరే మార్గంలోకి తాను ఎందుకు మరలలేదోనని అది ఆశ్చర్యపోతుంది.

అంతరంగ సమరం ఒక వాస్తవమే. దానిగుండా వెళ్లే మార్గం– నిజాయితీతో కూడిన తపన. దాని ఫలితం ఇప్పటికే చైతన్యపు స్వభావంలో లిఖితమై ఉంది; సత్యం నిలకడగా ఉంటుంది, అసత్యం వాడిపోతుంది. శాశ్వత సమన్వయం జరిగే వరకు, ఆ సత్యంతో సమన్వయమయ్యే ప్రయత్నం మళ్లీ మళ్లీ చేయడమే మీ పని.

ఆ సమన్వయాన్నే స్వేచ్ఛ అని అంటారు.
ఆ స్వేచ్ఛ స్వగృహానికి రమ్మని మిమ్మల్ని పిలుస్తోంది.

ఓం శాంతిః, శాంతిః, శాంతిః.

ప్రేమతో, గౌరవంతో,
కమలేష్
పూజ్యశ్రీ లాలాజీ మహరాజ్ గారి జయంతి ఉత్సవం, 2026, ఫిబ్రవరి 2వ తేదీ

పూజ్యశ్రీ లాలాజీ మహరాజ్
153 వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన సందేశం
2026 ఫిబ్రవరి 1, 2 & 3 తేదీలు కాన్హా శాంతివనం



దాజీతో మాస్టర్ క్లాసులు

హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానాన్ని మీరెప్పుడైనా ప్రారంభించవచ్చు. మూడు భాగాల మాస్టర్ క్లాసుల కోసం దాజీతో కలవండి. వాటిలో వారు హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి యొక్క ప్రయోజనాలను చెబుతారు. మీ దైనందిన జీవితానికి హార్ట్‌ఫుల్‌నెస్ రిలాక్సేషన్, ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థనలను ఎలా జోడించవచ్చో వారు వివరిస్తారు. మాస్టర్ క్లాసులన్నీ ఉచితమే.

https://heartfulness.org/global/masterclass/

హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా పద్ధతులు

హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా పద్ధతులను కనుగొనండి. రిలాక్స్ అవడం, ధ్యానం చేయడం, నిర్మలీకరణ చేయడం, ప్రార్థన చేయడం నేర్చుకోండి.

https://heartfulness.org/in-en/heartfulness-practices/

heartfulness

purity weaves destiny